సాక్షి
వికారాబాద్

మంగళవారం । 17 । జూన్ । 2025



నిరుత్సాహం వద్దు!

నిరుద్యోగ యువత కోసం ప్రభుత్వం, అను బంధ సంస్థలు ముందుకొచ్చి ఉచిత నైపుణ్య శిక్షణ ఇచ్చి అండగా నిలుస్తున్నాయి. 8లో▸



విద్యాహక్కు చట్టాన్ని..

ప్రైవేట్ పాఠశాలల్లో విద్యా హక్కు చట్టాన్ని అమలు చేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక నేతలు కోరారు. 8లో▸



కాంగ్రెస్‌తోనే సొంతింటి..

కాంగ్రెస్‌తోనే పేదల సొంతింటి కల సాకారమవుతుందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు జెన్నె నాగప్ప అన్నారు. 9లో▸

పరిషత్తు.. కసరత్తు

జిల్లా పరిషత్ ఎన్నికలకు సిద్ధమవుతున్న అధికారులు

- పార్టీ గుర్తుపై ఎలక్షన్‌కు వెళ్లేందుకే ప్రభుత్వం మొగ్గు
- జిల్లాలో పెరిగిన ఎంపీటీసీ, జెడ్పీటీసీ, ఎంపీపీ స్థానాలు
- పోటీకి సిద్ధమవుతున్న ఆశావహులు

వికారాబాద్: మళ్లీ ఎన్నికల సందడి ప్రారంభం కానుంది. ఇప్పటికే అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలు ముగియగా మండల, జిల్లా పరిషత్ ఎన్నికలకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. స్థానిక సంస్థల్లో అన్నింటికంటే ముందుగా గ్రామ పంచాయతీ సర్పంచుల పదవీ కాలం ముగియగా ప్రభుత్వం జీపీలకు బదులుగా మండల, జిల్లా పరిషత్ ఎన్నికలకు వెళ్లేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వం ఏర్పాటయ్యి ఏడాదిన్నర పూర్తయిన నేపథ్యంలో పార్టీ గుర్తుతో నిర్వహించే ఎన్నికలకే వెళ్లాలని భావిస్తున్నట్లు సమాచారం. ఇందులో భాగంగానే అధికారులకు దిశానిర్దేశం చేసినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం అందుబాటులో ఉన్న 2011 సెన్సెస్ ప్రకారం ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాలు ఎన్ని ఉండాలనే దానిపై అధికారులు ఇప్పటికే ఓ అంచనాకు వచ్చారు. కొత్తగా ఏర్పాటైన మండలాలు, పక్క మండలాల నుంచి కలిసిన గ్రామాలు, మండలాల నుంచి మున్సిపాలిటీల్లో విలీనమైన గ్రామాలను పరిగణలోకి తీసుకొని మండలాల వారీగా ఎంపీటీసీల సంఖ్యను నిర్ణయించారు. కొత్త గా ఏర్పాటు చేసిన మండలాల్లో సైతం ఎంత మంది ఎంపీటీసీలు ఉండలానే విషయంలోనూ కసరత్తు పూర్తి చేశారు. ఈ లెక్కలు ఇప్పటికే పంచాయతీరాజ్ కమిషనర్‌కు అందజేసినట్లు సమాచారం.

ప్రస్తుతం 'ప్రత్యేక' పాలన

గ్రామ పంచాయతీల పదవీ కాలం గతేడాది జనవరి 31తో ముగియగా ఫిబ్రవరి నుంచి ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతోంది. ఇప్పటికే జీపీ ఎన్నికలు సైతం పూర్తి కావాల్సి ఉండగా ప్రభుత్వం అనివార్య కారణాల వల్ల వాయిదా వేసింది.



వికారాబాద్‌లోని జెడ్పీ కార్యాలయం

జిల్లాలో మొత్తం 221 మంది ఎంపీటీసీలు ఉండగా వారి పదవీ కాలం గతేడాది జూలైలోనే ముగిసింది. ఇక జెడ్పీటీసీలు 18 మంది ఉండగా వారి పదవీ కాలం కూడా అదే నెలలో ఒక్కరోజు తేడాతో ముగిసింది. ఈ ఏడాది జనవరిలో మున్సిపాలిటీల పదవీ కాలం సైతం ముగిసిన విషయం తెలిసిందే. జీపీలు, మండల, జిల్లా పరిషత్‌లతో పాటు మున్సిపాలిటీల్లో ప్రజా ప్రతినిధుల స్థానంలో ప్రత్యేకాధికారులు కొనసాగుతున్నారు. గతంలో ప్రభుత్వం గ్రామ పంచాయతీ ఎన్నికలకు సిద్ధం కావాలని అధికారులను ఆదేశాంచింది. ఓటరు జాబితా సిద్ధ చేయాలని, బీసీ కమిషన్ నివేదికతో రెడీగా ఉండాలని సూచించిన విషయం తెలిసిందే. రాష్ట్ర ఎన్నికల సంఘం గ్రామ పంచాయతీలు, వార్డుల వారీగా పోలింగ్ స్టేషన్ల ఏర్పాటు చేయాలని ఆదేశిస్తూ షెడ్యూల్ విడుదల చేయడంతో అధికారులు ఆ ప్రక్రియ పూర్తి చేశారు. దాన్ని పక్కన పెట్టిన ప్రభుత్వం తాజాగా పరిషత్ ఎన్నికల నిర్వహణపై దృష్టి సారించింది. దీంతో అందరి దృష్టి మండల, జిల్లా పరిషత్ ఎన్నికలపై పడింది. ఇక వరుస ఎన్నికలు రావడం ఖాయమని విశ్లేషకులు భావిస్తున్నారు.

పెరిగిన స్థానాలు

జిల్లాలో 2019 మండల, జిల్లా పరిషత్ ఎన్నికలతో పోలిస్తే ఈ సారి మండల పరిషత్, ఎంపీటీసీల సంఖ్య పెరిగింది. గత ఎన్నికల 18 మండల పరిషత్‌లకు ఎన్నికలు నిర్వహించగా కొత్తగా ఏర్పాటైన చౌడాపూర్, దుద్యాల్ మండలకు ఈ సారి ఎన్నికలు నిర్వహించనున్నారు. దీంతో మండల పరిషత్‌ల సంఖ్య 20కి చేరింది. గతంలో 221 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు జరగ్గా ప్రస్తుతం వీటి సంఖ్య ఆరు పెరిగి 227కు చేరింది. మన జిల్లా పరిధిలోని బొంరాస్‌పేట్, నారాయణపేట్ జిల్లా పరిధిలోని కోస్గి మండలం నుంచి కొన్ని గ్రామాలను తీసుకుని కొత్త మండలంగా దుద్యాల్‌ను ఏర్పాటు చేశారు. కుల్కచర్ల మండలానికి చెందిన కొన్ని గ్రామాలు గతంలో మహబూబ్‌నగర్ జిల్లా నవాబుపేట మండలంలో కలిసిన మరి కొన్ని గ్రామాలతో చౌడాపూర్ మండలాన్ని ఏర్పాటు చేశారు. పరిగి మండలం నుంచి కొన్ని గ్రామాలు పరిగి మున్సిపాలిటీలో విలీనం చేసినప్పటికీ నవాబుపేట, కోస్గి మండలాల నుంచి కొన్ని గ్రామాలు మన జిల్లాలో కలవడంతో ఎంపీటీసీల సంఖ్య పెరిగింది. వీటన్నింటికీ ఈసారి ఎన్నికలు జరగనున్నాయి.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

ప్రభుత్వ బడులను ఆదరిద్దాం

- కలెక్టర్ ప్రతీక్‌జైన్
- వికారాబాద్‌లో బడిబాట కార్యక్రమం

అనంతగిరి: తల్లిదండ్రులు వారి పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ సూచించారు. సోమవారం వికారాబాద్‌లోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల సిబ్బంది బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఉపాధ్యాయులు, విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన ఎఫ్ఎల్ఎన్, ఎల్ఐపీ కార్యక్రమాలను జ్యోతి ప్రజల్వన చేసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. చదువు చెప్పే ఉపా ధ్యాయులను గౌరవించాలని విద్యార్థులకు సూచించారు. బాగా చదువుకుంటేనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. ఎఫ్ఎల్ఎన్, ఎల్ఐపీ కార్యక్రమాలు సక్రమంగా అమలయ్యేలా చూడాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో సామర్థ్యాలు పెంచేందుకు దోహదం చేస్తుందని వివరించారు. అనంతరం విద్యార్థుల నృత్య ప్రదర్శనను తిలకించారు. ఈ సందర్భంగా కలెక్టర్ తన చిన్ననాటి ఉపాధ్యాయురాలు తారబాయిని గుర్తు చేసుకున్నారు. ఆమె చదువు చెప్పడంతోనే తాను ఈ స్థాయిలో ఉన్నానని పేర్కొన్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు యూనిఫామ్స్, నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. విద్యార్థులు ఏర్పాటు చేసిన టీఎల్ఎం స్టాల్స్‌ను సందర్శించి అభినందించారు. కార్యక్రమంలో డీఈఓ రేణుకాదేవి, మండల విద్యాధికారి బాబుసింగ్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీశైలం, ఎస్ఎంసీ చైర్మన్ విజయలక్ష్మి ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పథకాలు ప్రజలకు అందేలా చూడాలి

ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు అందేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి విజ్ఞప్తులను స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో అపరిష్కృతంగా ఉన్న సమస్యలను సత్వర పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు, బడిబాట కార్యక్రమం, వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని మండల అధికారులకు సూచించారు. రేషన్ దుకాణాల్లో మూడు నెలల సన్న బియ్యం పంపిణీపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. వివిధ సమస్యల పరిష్కారం కోసం 84 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు.కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, ఆర్డీఓ వాసుచంద్ర తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

కమ్మేసిన పొగమంచు



ధారూరు: మండల కేంద్రంలో సోమవారం పొగమంచు ప్రజల్ని, ప్రయాణికులను ఇబ్బందుల పాలుచేసింది. పొలాలను సైతం పొగమంచు ఆవరించింది. రోడ్లను కమ్మేయడంతో వాహనదారులు లైట్లు వేసుకుని వెళ్లాల్సి వచ్చింది.

విద్యార్థులకు వేడి భోజనం అందించాలి

సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ సుబ్బలక్ష్మి



హాస్టల్ సిబ్బందితో మాట్లాడుతున్న సుబ్బలక్ష్మి

మోమిన్‌పేట: విద్యార్థులకు నిత్యం వేడి భోజనం అందించాలని సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ సుబ్బలక్ష్మి ఆదేశించారు. సోమవారం మండల కేంద్రంలోని ఎస్సీ హాస్టల్‌ను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులకు మెనూ ప్రకారం నిత్యం వేడిగా రుచికరమైన భోజనం పెట్టాలన్నారు. హాస్టల్ పరిసరాలు, గదులు, కిచెన్ షెడ్డును శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. పారిశుద్ధ్యం లోపిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. విద్యార్థులను కనిపెట్టుకొని ఉండాలని, రోజూ పాఠశాలకు వెళ్లేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఎస్‌డబ్ల్యూ శుక్ర వర్ధన్‌రెడ్డి, హెచ్‌ఓ జైపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

స్పెషల్ ఆఫీసర్ పల్లవిరెడ్డి



బంట్వారం: కోట్‌పల్లి కేజీబీవీ జూనియర్ కళాశాలలో గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానిస్తున్నట్లు స్పెషల్ ఆఫీసర్ పల్లవీరెడ్డి సోమవారం తెలిపారు. ఇంగ్లిష్ లెక్చరర్ పోస్టులు రెండు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. ఎంపీహెచ్‌డబ్ల్యూ 1,ఎంఎల్టీ ఒక పోస్టు ఖాళీగా ఉన్నాయన్నారు. మహిళా అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. అభ్యర్థులు వికారాబాద్ జిల్లా నివాసులై ఉండాలన్నారు. మెరిట్, డెమో, ఆయా విభాగాల్లో సంవత్సరం పాటు బోధన చేసిన అనుభవం ఉండాలన్నారు. తాత్కాలిక పద్ధతిని నియమించడం జరుగుతుందన్నారు.ఆసక్తి గల మహిళా అభ్యర్థులు బయోడేటా, విద్యార్హత సర్టిఫికెట్లు, పాస్ ఫొటోలు, ఇతర ధ్రువ పత్రాలతో ఈ నెల 18వ తేదీలోపు కోట్‌పల్లి కేజీబీవీలో సమర్పించాలన్నారు. మిగతా వివరాలకు సెల్ నంబర్ 8328 415565ను సంప్రదించాలని సూచించారు.

19న ప్రవేశ పరీక్ష

కుల్కచర్ల: తెలంగాణ ప్రభుత్వ క్రీడా పాఠశాలలో ప్రవేశాలకు ఈ నెల 19న పరీక్ష నిర్వహించనున్నట్లు ఎంఈఓ హబీబ్ అహ్మద్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. 2025-26 విద్యా సంవత్సరంలో 5వ తరగతిలో ప్రవేశాల కోసం కుల్కచర్లలో పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎగ్జామ్ రాయాలనుకునే విద్యార్థులు ప్రభుత్వ అధికారిక వెబ్‌సైట్ లేదా పీఈటీ ప్రవీణ్ సెల్ నంబర్ 9948640187లో సంప్రదించాలని సూచించారు.

విధులు బహిష్కరించిన న్యాయవాదులు



నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

అనంతగిరి: వికారాబాద్‌లో సోమవారం న్యాయవాదులు తమ విధులను బహిష్కరించారు. ఈనెల 14న హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టు సంబంధించిన న్యాయవాదులు నారాయణ, శైలేష్ సక్సేనాలపై దాడి ఘటనను నిరసిస్తూ విధులు బహిష్కరించారు. దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని వారు కోరారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నూలి బస్వరాజు, ప్రధాన కార్యదర్శి వెంకట్‌రెడ్డి, సీనియర్ న్యాయవాదులు మాధవరెడ్డి, ఆనంద్, శంకరయ్య, కమాల్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, లవకుమార్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులతో జాగ్రత్త

- రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డి

సాక్షి, రంగారెడ్డిజిల్లా: సీజనల్ వ్యాధులపై అంతా అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ నారాయణరెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. వర్షాకాలంలో వ్యాధులు ప్రబలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ఆయన ప్రజల నుంచి 68 అర్జీలను స్వీకరించారు. అనంతరం అధికారులతో మాట్లాడుతూ.. సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహించే ప్రజావాణిలో ప్రజల నుంచి అందిన వినతులను పెండింగ్‌లో పెట్టొద్దని అన్నారు. ఎప్పటికప్పుడు వాటిని పరిశీలించి, బాధితులకు తగిన పరిష్కార మార్గం చూపించాలని ఆదేశించారు. వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో గ్రామాల్లో పారిశుద్ధ్య లోపం తలెత్తే ప్రమాదం ఉందన్నారు. వీధుల్లో చెత్త పేరుకపోకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని, మురుగు నీటి కాల్వల్లోని వ్యర్థాలను తొలగించి, వరద నీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. దోమలు, ఈగలు వ్యాప్తి చెంది ప్రజలు సీజనల్ రోగాల బారినపడే ప్రమాదం ఉందని, వ్యాధుల నియంత్రణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలను వారికి వివరించాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్, డీఆర్‌ఓ సంగీత, వివిధ విభాగాల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

50శాతం రిజర్వేషన్లు కల్పించాలి

- బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్ యాదవ్



బంట్వారం: చట్ట సభల్లో బీసీలకు 50శాతం రిజర్వేషన్లు కల్పించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అత్తెల్లి లక్ష్మణ్ యాదవ్ డిమాండ్ చేశారు. సోమవారం బంట్వారంలో ఆయన మాట్లాడారు. పార్లమెంటులో బీసీ బిల్లు ప్రవేశపెట్టాలని, లేకుంటే యుద్ధం తప్పదని హెచ్చరించారు. రాజకీయ పార్టీలు బీసీలను ఓటు బ్యాంకుగా వాడుకుంటూ రాజ్యాధికారంలో వాటా ఇవ్వకుండా అన్యాయం చేస్తున్నాయని మండిపడ్డారు. ఏడు దశాబ్దాల స్వతంత్ర భారతంలో బీసీలకు రాజకీయంగా కనీస ప్రాతినిధ్యం లభించడం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం సేకరించిన గణంకాల ప్రకారం చట్ట సభల్లో బీసీల ప్రాతినిధ్యం 14 శాతం దాట లేదన్నారు. దేశ జనాభాలో 56 శాతం బీసీలు ఉన్నారని ఆయన గుర్తు చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రజాస్వామ్య స్ఫూర్తి ఎక్కడ కనినిస్తుందని ప్రశ్నించారు. బీసీ ఉద్యోగులకు పదోన్నతుల్లో రిజర్వేషన్లు కల్పించేలా రాజ్యాంగ సవరణ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టాలని ప్రధానిని కోరారు. కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. లక్ష కోట్లతో బీసీ సబ్ ప్లాన్‌ను ఏర్పాటు చేయాలన్నారు. జాతీయ బీసీ కమిషన్‌కు రాజ్యాంగ బద్ధమైన హక్కులు కల్పించాలన్నారు. బీసీల న్యాయమైన డిమాండ్లపై త్వరలోనే వేలాది మందితో చలో ఢిల్లీ కార్యక్రమం చేపడతామని ఆయన పేర్కొన్నారు.

కేంద్ర పథకాలతో నిరుపేదలకు మేలు



మాట్లాడుతున్న బొక్క నర్సింహారెడ్డి

కందుకూరు: కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వం 11 ఏళ్లుగా అమలు చేస్తున్న పథకాలు నిరుపేదలు, బడుగు బలహీన వర్గాలకు ఎంతో మేలు చేశాయని బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో సోమవారం పార్టీ మండల అధ్యక్షుడు నిమ్మ అంజిరెడ్డి ఆధ్వర్యంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. కేంద్రం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, అవగాహన కల్పించాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కష్టపడి పని చేసి పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందెల శ్రీరాములుయాదవ్, కడారి జంగయ్యయాదవ్, మండల ఇన్‌చార్జి పోరెడ్డి అర్జున్‌రెడ్డి, బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ ఎల్మటి దేవేందర్‌రెడ్డి, జిల్లా నాయకులు జిట్టా రాజేందర్‌రెడ్డి, పి.శ్రీనివాస్‌గౌడ్, ఎస్.మల్లారెడ్డి. ఎ.సత్తయ్య, ఎస్.నర్సింహారెడ్డి, బాబురావు తదితరులు పాల్గొన్నారు.

'రైతు నేస్తం'ను సద్వినియోగం చేసుకోండి

- అడిషనల్ కలెక్టర్ సుధీర్

మోమిన్‌పేట: రైతు నేస్తం కార్యక్రమం ద్వారా అన్నదాతలకు పంటల సాగుపై సూచనలు, సలహాలు ఇవ్వడం జరుగుతుందని అడిషనల్ కలెక్టర్ సుధీర్ తెలిపారు. సోమవారం మండలంలోని మేకవనంపల్లి రైతు వేదికలో రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా ముఖ్యమంత్రి సందేశాన్ని వినిపించారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ.. గతంలో మోమిన్‌పేటలో రైతు నేస్తం కార్యక్రమం నిర్వహించే వారమని దీన్ని మరో రెండు చోట్ల నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. ప్రతి మంగళవారం శాస్త్రవేత్తలు పంటల సాగుపై సలహాలు, సూచనలు ఇస్తారని తెలిపారు. రైతులు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సేంద్రియ ఎరువుల వాడకం పెంచాలన్నారు. కార్యక్రమంలో మర్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్‌రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ అంజిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శంకర్, నాయకుడు సురేందర్, ఎంపీడీఓ విజయలక్ష్మి, తహసీల్దార్ రవీందర్,ఏఓ జయశంకర్, ఏఈఓలు పెంటయ్య, శ్రీనివాస్, చంద్రిక, శశాంక్ తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకుంటాం

కొడంగల్: రాష్ట్రంలోని రైతులను ఆదుకుంటామని.. వారిని ఆర్థికంగా బలోపేతం చేస్తామని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అన్నారు. ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావ్‌తో కలిసి సోమవారం హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల రైతులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. రైతులకు అందుతున్న సంక్షేమ పథకాల గురించి అడిగి తెలుసుకున్నారు. మండలంలోని రావులపల్లి, చిట్లపల్లి, పర్సాపూర్ గ్రామాల రైతు వేదికల్లో ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్‌లో అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. వానాకాలం 2025 సీజన్‌కు సంబంధించి రైతు భరోసా అందిస్తామని మంత్రులు పేర్కొన్నారు. వివిధ పథకాల ద్వారా రైతులను ఆర్థికంగా బలోపేతం చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి (జిల్లా అటవీ శాఖాధికారి) జ్ఞానేశ్వర్, తహసీల్దార్ విజయ్ కుమార్, ఏఎంసీ చైర్మన్ అంబయ్య గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ శివకుమార్ గుప్తా, ఎంపీడీఓ ఉష శ్రీ, మండల వ్యవసాయాధికారి తులసీ, ఏఈఓలు తదితరులు పాల్గొన్నారు.



మోమిన్‌పేట: రైతు నేస్తం కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ సుధీర్ తదితరులు

స్టయిఫండ్ చెల్లించాలంటూ ధర్నా

- విధులు బహిష్కరించి నిరసన తెలిపిన హౌస్ సర్జన్స్, పీజీ విద్యార్థులు



కళాశాల ఎదుట ధర్నా చేస్తున్న వైద్య విద్యార్థులు

అనంతగిరి: వికారాబాద్ పట్టణంలోని మహావీర్ మెడికల్ కళాశాలలో హౌస్ సర్జన్స్, పీజీ విద్యార్థులు స్టయిఫండ్ చెల్లించాలని డిమాండ్ చేస్తూ సోమవారం విధులు బహిష్కరించి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నాలుగు నెలలుగా కళాశాల యాజమాన్యం స్టయిఫండ్ చెల్లించడం లేదని పేర్కొన్నారు. జీవో నంబర్ 59, ఎన్ఎంసీ నిబంధనల ప్రకారం ప్రతి మెడికల్ కళాశాలలో హౌస్ సర్జన్లకు నెలకు రూ.25,906, పీజీ విద్యార్థులకు రూ.58.289 చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. కానీ కళాశాల యాజమాన్యం నాలుగు నెలలుగా ఈ మొత్తం ఇవ్వడం లేదన్నారు. వెంటనే స్పందించి మా సమస్యను పరిష్కరించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

కలిసి పనిచేస్తే విజయం మనదే

- ఏఐసీసీ కార్యదర్శి విశ్వనాథం
- కేంద్రం ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తోందని ఆరోపణ

నవాబుపేట: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అందరం కలసికట్టుగా పనిచేస్తే విజయం మనదేనని ఏఐసీసీ కార్యదర్శి విశ్వనాథం అన్నారు. సోమవారం మండల కేంద్రంలో నిర్వహించిన జై బాపు.. జై భీమ్.. జై సంవిధాన్ సమావేశంలో పాల్గొన్న మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలన్నారు. దీర్ఘకాలంగా పార్టీ కోసం పనిచేసిన వారికి పదవులు రాకుండా కొందరు అడ్డుపడుతున్నారని కార్యకర్తలు పేర్కొన్నారు. స్పందించిన ఆయన విభేదాలు పక్కనపెట్టి పార్టీ కోసం పని చేస్తే పదవులు అవంతట అవే వస్తాయన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని తుంగలోకి తొక్కాలని చూస్తోందని ఆరోపించారు. రాజ్యాంగమే శాశనంగా కాంగ్రెస్ పార్టీ ముందుకు సాగుతోందన్నారు. కేంద్రం కొన్ని సంస్థలను అడ్డం పెట్టుకొని ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు సూచించారు. పార్టీ సమావేశాలు, పథకాలపై సోషల్ మీడియా ద్వారా ప్రచారం చేయాలన్నారు. కార్యక్రమంలో పీసీసీ కార్యదర్శి ధారాసింగ్ నాయక్, రాష్ట్ర డెయిరీ కార్పొరేషన్ చైర్మన్ గుప్త అమిత్ రెడ్డి, పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు చల్ల నర్సింహారెడ్డి, చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జ్ పామేనా భీమ్ భరత్, మండల అధ్యక్షుడు వెంకటయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్లు, నాయకులు వెంకట్‌రెడ్డి, యాదవ్, మధుసూదన్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, రాములు, సంజీవరెడ్డి, ఎక్బాల్, ప్రసాద్, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న విశ్వనాథం

క్లుప్తంగా

ఒకే దరఖాస్తు..!



దుప్‌చర్లలో రెవెన్యూ సదస్సులో తహసీల్దారు

బొంరాస్‌పేట: మండలంలోని దుప్‌చర్ల గ్రామంలో సోమవారం నిర్వహించిన భూభారతి రెవెన్యూ సదస్సులో దరఖాస్తుల కోసం రెవెన్యూ అధికారులు పడిగాపులు కాయాల్సి వచ్చింది. సాయంత్రం కార్యక్రమం ముగిసే సమయంలో ఒకే దరఖాస్తు వచ్చింది. రెవెన్యూ సదస్సులపై అవగాహన కల్పించకపోవడమా? భూ సమస్యలే లేవా? భూభారతి చట్టంపై అపనమ్మకమా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. మంగళవారం మండలంలోని సాలిండాపూర్‌లో భూభారతి రెవెన్యూ సదస్సు నిర్వహించనున్నారు.

రైతు నేస్తం కార్యక్రమంలో కలెక్టర్



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

అనంతగిరి: వికారాబాద్ మండలం గొట్టిముక్కుల గ్రామ రైతు వేదికలో సోమవారం నిర్వహించిన రైతు నేస్తం కార్యక్రమంలో కలెక్టర్ ప్రతీక్‌జైన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్ కార్యక్రమాన్ని రైతులు, అధికారులతో కలిసి వీక్షించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

దాడిచేసిన వారిని అరెస్ట్ చేయాలి

సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్



మాట్లాడుతున్న శ్రీనివాస్

తాండూరు రూరల్: మండల పరిధిలోని చెన్‌గేస్‌పూర్‌లో ఎరుకల కుటుంబంపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సోమవారం గౌతపూర్ సమీపంలోని కరన్‌కోట్ పోలీస్‌స్టేషన్ వద్ద విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. చెన్‌గేస్‌పూర్‌లో నివాసముంటున్న శారద బస్వరాజ్ కుటుంబంపై అదే గ్రామానికి చెందిన రమేష్‌గౌడ్, నరేందర్ గౌడ్, నానిగౌడ్, నరేష్‌గౌడ్, పవన్‌గౌడ్ దాడి చేశారన్నారు. దాడిచేసిన వారిపై వెంటనే అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. బెల్కటూర్‌లో దళిత యువకుడిపై దాడి చేసిన ఘటన మరవకముందే చెన్‌గేస్‌పూర్‌లో ఎరుకల కుటుంబంపై దాడి చేయడం దారుణమన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న జిల్లాలో దళితులు, ఎస్టీలపై దాడులు జరుగుతున్న ఎవరూ పట్టించుకోవడం లేదని శ్రీనివాస్ అవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వెంకటేష్, కృష్ణ, చంద్రప్ప, సాయిలు, శారద, బస్వరాజ్, లక్ష్మి, కిష్టప్ప తదితరులు ఉన్నారు.

మంత్రి శ్రీహరిని కలిసిన ఎమ్మెల్యే బీఎంఆర్



మంత్రి వాకిటి శ్రీహరికి శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు: మంత్రి వాకిటి శ్రీహరిని సోమవారం నగరంలో తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఇటీవల వాకిటి శ్రీహరి మంత్రి పదవి చేపట్టడంతో ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రిని సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

బీజేపీతోనే తండాల అభివృద్ధి

గిరిజన మోర్చ రాష్ట్ర అధ్యక్షుడు కల్యాణ్‌నాయక్

కడ్తాల్: బీజేపీతోనే గిరిజన తండాల అభివృద్ధి సాధ్యమని గిరిజన మోర్చ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కల్యాణ్‌నాయక్, నాగర్‌కర్నూల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు వేముల నరేందర్‌రావు అన్నారు. కేంద్రంలో ప్రధానిగా మోదీ బాధ్యతలు చేపట్టి 11 ఏళ్లే పూర్తయిన సందర్భంగా సోమవారం మండల పరిధిలోని మైసిగండిలో పార్టీ మండల అధ్యక్షుడు మహేశ్ దోనాదుల అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. గిరిజనుల అభివృద్ధికి ప్రధాని మోదీ అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తున్నారని తెలిపారు. గిరిజన విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించేందుకు సమ్మక్క సారలమ్మ గిరిజన యూనివర్సిటీ ఏర్పాటుకు చర్యలు చేపట్టారని పేర్కొన్నారు.

నిరుత్సాహం వద్దు!

నైపుణ్య శిక్షణతో ఉద్యోగం సొంతం
- 24 ఏళ్ల లోపు యువతకు ఉచిత నైపుణ్య శిక్షణ
- రేపు కొడంగల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అవగాహన
- సీఎం నియోజకవర్గంలో సరికొత్త శిక్షణ



నైపుణ్య శిక్షణ కేంద్రం

బొంరాస్‌పేట: నిరుద్యోగ యువత కోసం ప్రభుత్వం, అనుబంధ సంస్థలు ముందుకొస్తున్నాయి. ఉచిత నైపుణ్య శిక్షణతో నేరుగా ఉద్యోగం పొందేలా తర్ఫీదునివ్వనున్నారు. వారి ఆసక్తికి అనుగుణంగా వారు కోరుకునే విధంగా నైపుణ్యం పెంపొందించుకుని ఎదగవచ్చు. యువత ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందేందుకు ఇదొక సువర్ణావకాశమని కొడంగల్ ప్రభుత్వ డిగ్రీకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఆయన వివరించారు.

యంగ్ ఇండియా సహకారంతో..

హైదరాబాద్ సమీపంలో ముచ్చింతల్‌లో యంగ్ ఇండియా సహకారంతో నైపుణ్యాల శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తోంది. కొడంగల్ ప్రాంతంతో ఇంటర్ ఆపై చదివుకున్న నిరుద్యోగులకు ఈ నైపుణ్య శిక్షణ ఇవ్వనున్నారు.

శిక్షణ ఇలా..

స్కిల్ యూనివర్సిటీ(నైపుణ్యాల విశ్వవిద్యాలయం)ద్వారా శిక్షణలుంటాయి. బీఎఫ్ఎస్ఐ తదితర రంగాల్లో వారం పాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. లాజిస్టిక్స్ శిక్షణ, ఇంటర్వ్యూ అనంతరం ఉద్యోగం పొందే అవకాశం కల్పిస్తున్నారు. అమేజాన్, స్విగ్గీ తదితర కంపెనీలలో ఉద్యోగాలు పొందేలా శిక్షణ ఇవ్వనున్నారు.

రేపు జాబ్‌మేళా

ఈ నైపుణ్యాల శిక్షణపై పట్టణ సమీపంలోని బండల ఎల్లమ్మ ఆలయం వద్దనున్న ప్రభుత్వ డిగ్రీకళాశాలలో ఈనెల 18న బుధవారం నిర్వహించనున్న జాబ్‌మేళాలో ఉచిత అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఇంటర్మీడియెట్ పూర్తిచేసినవారు, డిగ్రీ రెండో సంవత్సరం లేదా డిగ్రీ పూర్తయిన వారు అర్హులంటున్నారు.

యువతకు సదావకాశం



నైపుణ్యాల శిక్షణ యువతకు సదవకాశం. పేద, మధ్య తరగతి యువత సద్వినియోగం చేసుకోవాలి. ఈ నైపుణ్య శిక్షణపై యంగ్ ఇండియా వీసీ, హైదరాబాద్ ప్రొఫెసర్‌లు అవగాహన కల్పించనున్నారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ మెమోలను డిగ్రీకళాశాలలోని డాక్టర్ మనోహర్ హాలులో అందజేయాలి.

– డాక్టర్ బి.శ్రీనివాస్‌రెడ్డి, ప్రిన్సిపాల్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కొడంగల్

రైతులందరికీ రుణమాఫీ అమలు చేయాలి

తెలంగాణ కిసాన్ సంఘ్ వ్యవస్థాపక అధ్యక్షుడు విజయ్‌కుమార్



అడిషనల్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న విజయ్‌కుమార్

అనంతగిరి/పరిగి: రైతులందరికీ రుణమాఫీ పథకం అమలు చేయాలని తెలంగాణ కిసాన్ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు విజయ్‌కుమార్ కోరారు. సోమవారం ఈ మేరకు అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం సగం మందికే రుణమాఫీ అమలు చేయడం సరికాదన్నారు. రూ.2 లక్షలు మాఫీ చేస్తామని చెప్పి కొర్రీలు పెట్టారని మండిపడ్డారు. దీంతో చాలా మందికి అన్యాయం జరిగిందన్నారు. ప్రస్తుత సీజన్‌కు సంబంధించి పంట రుణాలు ఇవ్వకుండా బ్యాంకర్లు రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వక్తం చేశారు. పొలం ఉన్న ప్రతి రైతుకూ రైతు భరోసా డబ్బు జమ చేయాలని డిమాండ్ చేశారు.

లగచర్లలో ప్రశాంతంగా రెవెన్యూ సదస్సు



లగచర్ల రెవెన్యూ సదస్సులో ఫిర్యాదులు స్వీకరిస్తున్న అధికారులు

దుద్యాల్: మండల పరిధిలోని లగచర్లలో సోమవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సు ప్రశాంతంగా కొనసాగిందని తహసీల్దార్ కిషన్ అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన భూ భారతి చట్టంపై ప్రజలకు నమ్మకం పెరుగుతోందన్నారు. రైతు సమస్యల పరిష్కరించుకునేందుకు గ్రామాల్లో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులకు చక్కని స్పందన లభిస్తోందన్నారు. రెవెన్యూ సదస్సులో 31 ఫిర్యాదులు అందినట్లు ఉప తహసీల్దార్ వీరేశ్ బాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ నవీన్ కుమార్, రెవెన్యూ కార్యాలయ సిబ్బంది ఫకీరప్ప, ఊషప్ప, లాలాప్ప, పంచాయతీ కార్యదర్శి మోహన్ తదితరులు పాల్గొన్నారు.



మోమిన్‌పేట: మాట్లాడుతున్న మహేందర్‌రెడ్డి



కుల్కచర్ల: దరఖాస్తులు స్వీకరిస్తున్న తహసీల్దార్ మనోహర్ చక్రవర్తి

భూ సమస్యలకు సత్వర పరిష్కారం

మర్పల్లి ఏఎంసీ చైర్మన్ మహేందర్‌రెడ్డి

మోమిన్‌పేట: ధరణి తప్పిదాతలను సరి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని తీసుకు వచ్చిందని.. గ్రామాల్లో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మర్పల్లి ఏఎంసీ చైర్మన్ మహేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని దేవరంపల్లి, ఏన్కతల గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భూ సమస్యలున్న రైతులు దరఖాస్తులు చేసుకుంటే అధికారులు రికార్డులు నమోదు చేసి త్వరితగతిన పరిష్కరిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రవీందర్, డిప్యూటీ తహసీల్దార్ సురేశ్ కుమార్, ఆర్ఐలు గోవర్ధన్, సరిత, కార్యదర్శి నర్సింలు, రెవెన్యూ సిబ్బంది తదితరులు ఉన్నారు.

భూ భారతితో రైతులకు మేలు

కుల్కచర్ల: భూ భారతి రెవెన్యూ సదస్సులతో రైతులకు మేలు చేకూరుతుందని కుల్కచర్ల తహసీల్దార్ మనోహర్ చక్రవర్తి, డిప్యూటీ తహసీల్దార్ చంద్రశేఖర్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని బొంరెడ్డిపల్లి గ్రామంలో రెవెన్యూ సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భూభారతి చట్టం ద్వారా పెండింగ్ రెవెన్యూ సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు. రైతుల మేలుకోసం నిర్విరామంగా పనిచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గిర్దవరి రవి, ఖాజా రెవెన్యూ సిబ్బంది అనిత, స్వప్న తదితరులు పాల్గొన్నారు.



పరిగి: గడిసింగాపూర్ రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ తదితరులు

దరఖాస్తులు స్వీకరించిన తహసీల్దార్

పరిగి: భూ భారతి రెవెన్యూ సదస్సులతో భూ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని తహసీల్దార్ ఆనంద్‌రావు సూచించారు. సోమవారం మండల పరిధిలోని గడిసింగాపూర్‌లో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ నరేందర్, పంచాయతీ కార్యదర్శి మొగులయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యాహక్కు చట్టాన్ని అమలు చేయాలి

తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్



ఎంఈఓ రాంరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న శ్రీనివాస్

కొడంగల్: మండల పరిధిలోని ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో విద్యా హక్కు చట్టాన్ని అమలు చేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడు ఎరన్‌పల్లి శ్రీనివాస్ అన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన ఎంఈఓ రాంరెడ్డికి వినతిపత్రం అందజేశారు. జీఓ నంబర్ 46 ప్రకారం ఆర్థికంగా వెనుకబడిన పేద బలహీన వర్గాలకు 25 శాతం సీట్లు ఉచితంగా కేటాయించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యా హక్కు చట్టం ప్రకారం ఫీజులు వసూలు చేయాలన్నారు. ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో ఫీజులు పెంచుతూ పాఠ్య పుస్తకాలు, అడ్మిషన్ ఫీజులు అంటూ వ్యాపారం చేస్తున్న యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఓంకార్, సికిందర్, భాను తదితరులు పాల్గొన్నారు.

‘రైతు నేస్తం’తో కర్షకులకు మేలు



దోమ: రైతులతో కలసి వీడియో కాన్ఫరెన్స్ వీక్షిస్తున్న ఎమ్మెల్యే టీఆర్ఆర్



కుల్కచర్ల: కుస్మసముద్రంలో రైతు నేస్తం కార్యక్రమంలో పాల్గొన్న నేతలు

పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

దోమ: రైతునేస్తం కార్యక్రమంతో కర్షకులకు మేలు చేకూరుతుందని పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన మండల పరిధిలోని శివారెడ్డిపల్లి రైతు వేదికలో రైతులతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రసంగాన్ని వీక్షించారు. రైతులు వ్యవసాయంలో ఎదుర్కొంటున్న ఇబ్బందులు, దిగుబడులపై సీఎం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ వాసుచంద్ర, ఏడీఏ సౌభాగ్యలక్ష్మి కుమారి, ఎంపీడీఓ గ్యామా, మండల వ్యవసాయ అధికారి ప్రభాకర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

భూమి ఉన్న ప్రతి రైతుకూ రైతు భరోసా

తాండూరు రూరల్: భూమి ఉన్న ప్రతి రైతుకూ ప్రభుత్వం రైతు భరోస నిధులు విడుదల చేస్తుందని తాండూరు సబ్‌కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్ అన్నారు. సోమవారం మండలంలోని అంతారం రైతు వేదికలో రైతు నేస్తం కార్యక్రమంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి సందేశాన్ని వీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎలాంటి నిబంధనలు లేకుండా పథకం అమలు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పట్లోళ్ల బాల్‌రెడ్డి, ఏడీఏ రుద్రమూర్తి, తహసీల్దార్ తారాసింగ్, ఏవో కొమరయ్య, ఏఈవో తదితరులు పాల్గొన్నారు.

కుల్కచర్ల: వ్యవసాయం పండుగ చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నాడని డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, ఏఎంసీ చైర్మన్ ఆంజనేయులు ముదిరాజ్, పీఏసీఎస్ చైర్మన్ కనకం మొగులయ్య అన్నారు. సోమవారం మండల పరిధిలోని కుస్మసముద్రం రైతు వేదికలో రైతు నేస్తం కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. సాగులో ఎటువంటి అనుమానాలు ఉన్నా ప్రతీ మంగళవారం శాస్త్రవేత్తలో నిర్వహించే రైతు నేస్తం కార్యక్రమంలో నివృత్తి చేసుకోవచ్చునన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కుస్మసముద్రం, కుల్కచర్ల, చౌడాపూర్ గ్రామాల్లోని రైతు వేదికల్లో నిర్వహించిన రైతు నేస్తం కార్యక్రమంలో వ్యవసాయాధికారి వీరస్వామి, ఏఈఓలు బాబు, నిఖిత, కార్యదర్శి జీవామృతం, నాయకులు రాములు, లక్ష్మయ్య, భీమయ్య, కృష్ణయ్య, అంజిలయ్య, కృష్ణారెడ్డి, సాయన్న, ఎల్లయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సీఎం ప్రసంగాన్ని వీక్షించిన రైతులు

ధారూరు: వ్యవసాయ వర్సిటీలో సోమవారం నిర్వహించిన రైతునేస్తం కార్యక్రమానికి హాజరైన సీఎం రేవంత్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్‌ను అన్ని రైతు వేదికల్లో రైతులు, అధికారులు వీక్షించారు. ధారూరు రైతు వేదికలో మండల ప్రత్యేక అధికారి శ్రీనివాస్ రెడ్డి, తహసీల్దార్ సాజిదాబేగం, రైతులు హాజరైయ్యారు. కేరెళ్లి రైతు వేదికలో నూతనంగా వీడియో కాన్ఫరెన్స్‌ను ఎంపీడీఓ నర్సింలు, ఏఓ సూర్యప్రకాశ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మాన్‌సింగ్, ఏఈఓలు సంతోశ్, సంజూరాథోడ్ పాల్గొన్నారు.

దేవర్‌ఫసల్‌వాద్‌లో..

దౌల్తాబాద్: వ్యవసాయ వర్సిటీలో సోమవారం ముఖ్యమంత్రి రైతునేస్తం కార్యక్రమంలో భాగంగా వీడియో కాన్ఫరెన్స్‌లో రైతులతో ముఖాముఖి నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మండల పరిధిలోని దేవర్‌ఫసల్‌వాద్‌లోని రైతువేదికలో రైతులు వీక్షించారు. ప్రభుత్వం రైతుల సంక్షేమానికి కృషి చేస్తుందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వెంకట్రావు అన్నారు. కార్యక్రమంలో ఏఓ లావణ్య, ఏఈఓలు వైశాలి నాయకులు, రైతులు పాల్గొన్నారు.



ధారూరు: కేరెళ్లి రైతు వేదికలో సీఎం ప్రసంగాన్ని వింటున్న రైతులు

రైతు భరోసాపై హర్షం

యాలాల: రైతు భరోసాతో పాటు ప్రభుత్వ పథకాలపై సోమవారం సాయంత్రం సీఎం రేవంత్‌రెడ్డి నిర్వహించిన ప్రత్యక్ష ప్రసార కార్యక్రమాన్ని రైతులు వీక్షించారు. మండలంలోని రాస్నం రైతు వేదికలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి శ్వేతరాణి, ఏఈఓ శిరీషలు పాల్గొని కార్యక్రమాన్ని వీక్షించారు. వానకాలం రైతు భరోసా నగదు జమ విషయాన్ని ప్రభుత్వం ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ జనార్దన్‌రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ నర్సింలుగౌడ్, నాయకులు ఆరీఫ్ హుస్సేన్ తదితరులు ఉన్నారు.



తాండూరు రూరల్: రైతు నేస్తం కార్యక్రమంలో సబ్ కలెక్టర్ ఉమాశంకర్, రైతులు



ధారూరు: వీడియో కాన్ఫరెన్స్‌లో మండల ప్రత్యేక అధికారి శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్ సాజిదాబేగం



యాలాల: రాస్నం రైతు వేదికలో..

ప్రక్షాళన.. పూర్తయ్యేనా!

పెరిగిపోతున్న ఎండోమెంట్ పెండింగ్ కేసులు
- విచారణలో కీలక సాక్ష్యాలుగా మారిన ముంతకబ్ రికార్డులు
- నాటి ఉర్దూను అర్థం చేసుకోవడంలో అధికారుల ఇబ్బంది
- ఇంగ్లిష్‌లోకి అనువదించాలని లోకాయుక్త ఆదేశాలు
- ఏళ్లు గడుస్తున్నా పూర్తి కాని తర్జుమా ప్రక్రియ
- అన్యాక్రాంతమవుతున్న ఆలయ భూములు



సాక్షి, రంగారెడ్డిజిల్లా: దేవాలయాల భూములకు రక్షణ లేకుండా పోతోంది. హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో భూముల ధరలు అమాంతం పెరగడంతో కేటుగాళ్లు నకిలీ పత్రాలు సృష్టించి ఆక్రమణలకు పాల్పడుతున్నారు. చివరికి వివాదాలు కోర్టులు, ఎండోమెంట్ ట్రిబ్యూనల్స్‌కు చేరుకుంటున్నాయి. ఈ వివాదాల పరిష్కారంలో నిజాం కాలం నాటి ఉర్దూ భాషలో ముద్రించిన ముంతకబ్ రికార్డులు కీలక సాక్ష్యంగా నిలుస్తున్నాయి. వందల ఏళ్ల క్రితానికి చెందిన ఈ రికార్డులు ప్రస్తుతం అవసాన స్థితికి చేరుకున్నాయి. ముట్టుకుంటే చిరిగిపోతున్నాయి. నాటి ఉర్దూను అర్థం చేసుకోవడం నేటి అధికారులకు ఇబ్బందిగా మారింది. ఆలయ ఈఓలకు ఉర్దూపై కనీస పట్టు లేదు. దేవాలయ భూములపై అవగాహన లేకపోవడంతో కోర్టుల్లో కేసులు వీగిపోతున్నాయి. విలువైన ఆలయ భూములు చేజారిపోతున్నాయి. అంతే కాదు ముంతకబ్ రికార్డుల్లోని దేవాలయాల పేర్లు, ట్రస్టీ, ఫౌండర్ల గోత్ర నామాలు గుర్తించలేని స్థితికి చేరుకున్నాయి. వివాదాల పరిష్కారంలో కీలకమైన ఈ రికార్డులను భద్రపరచడంతో పాటు ఉర్దూ నుంచి ఆంగ్లంలోకి తర్జుమా చేసి, భూములు అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని లోకాయుక్త సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటి వరకు ఈ ప్రక్రియ పూర్తి చేయక పోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

దేవాదాయశాఖ భూములు (ఎకరాల్లో)

జిల్లా	మొత్తం భూమి	అన్యాక్రాంతం
మేడ్చల్	4,125.03	2,888.18
రంగారెడ్డి	9,360.01	1,148.15
హైదరాబాద్	5,718.01	2,374.25
వికారాబాద్	2,294	444.16

ఎండోమెంట్ ట్రిబ్యునల్‌లో కేసులు

2010 నుంచి ఇప్పటి వరకు నమోదైనవి	2,100
ఇప్పటి వరకు పరిష్కారమైనవి	1,365
ఇప్పటికీ పెండింగ్‌లో ఉన్నవి	735
హైదరాబాద్‌లో ఉన్న పెండింగ్ కేసులు	140
సికింద్రాబాద్‌లో పెండింగ్‌లో ఉన్న కేసులు	66
రంగారెడ్డి జిల్లాలో పెండింగ్‌లో ఉన్న కేసులు	249
ఇప్పటి వరకు తర్జుమా అయిన ముంతకబ్‌లు	1,013
అనువాదం పూర్తికాని రికార్డులు	1,000పైనే

పనులను వేగిరం చేయండి

చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య



విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

నవాబుపేట: విద్యార్థులు లక్ష్యంతో చదువుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. సోమవారం ఆయన మండల కేంద్రంలో కేజీబీవీని సందర్శించారు. పాఠశాల ఆవరణలో నిర్మిస్తున్న అదనపు గదులను పరిశీలించి పనులను వేగిరం చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం సిబ్బందితో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులకు యూనిఫాం, నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ రాంరెడ్డి, ఏఎంసీ చైర్మన్ గీతాసింగ్ నాయక్, ప్రిన్సిపాల్ శ్రీలత, నాయకులు వెంకట్‌రెడ్డి, ప్రభాకర్, ఎక్బాల్, రాజశేఖర్ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులు వినియోగించుకోండి

భూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కాలె యాదయ్య సూచించారు. మండల పరిధిలోని చిట్టిగిద్ద గ్రామంలో సోమవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు ఆయన హాజరయ్యారు. తహసీల్దార్ బుచ్చయ్య, డిప్యూటీ తహసీల్దార్ శ్రీలత పాల్గొన్నారు.



మహబూబ్‌నగర్ పట్టణంలో సోమవారం నిర్వహించిన ఓ ఆధ్యాత్మిక కార్యక్రమాన్ని రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ ఆర్.గురునాథ్‌రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసిన ప్రారంభించారు.

- కొడంగల్ రూరల్